కదిలిన 'ఉత్తర' సైన్యం

ఎన్నికల సమరానికి సిద్ధమంటూ ఉత్తర నియోజకవర్గం నుంచి జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తరలి వెళ్లింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు వేలాదిగా కదలివెళ్లారు. జగనన్న వెనుక మేమున్నామంటూ నాయకులు, మహిళలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ఆటోలు, బస్సుల్లో భీమిలి నియోజకవర్గం సంగివలసలో నిర్వహించిన ఎన్నికల శంఖారావం ప్రారంభ సభకు హాజరయ్యారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన జగనన్నను మరోసారి గెలిపిస్తామంటూ జైజగన్ నినాదాలతో హోరెత్తించారు. దారులన్నీ సంగివలస వైపే అన్నట్టు నియోజకవర్గంలోని 17 వార్డుల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు జగనన్నకు మద్దతుగా బయలుదేరారు.

- సీఎం వైఎస్ జగన్ సభకు పెద్ద ఎత్తున పయనం
- వార్డుల నుంచి పోటెత్తిన అభిమాన తరంగం
- జగనన్నకు మద్దతుగా ఉంటామంటూ నినాదాలు
- 100 ఆటోలు, 95 బస్సులు, కారుల్లో 'సిద్ధం' బహిరంగ సభకు..
- ర్యాలీ ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు


43వ వార్డు నుంచి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో బయలుదేరిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు


26వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి బయలుదేరిన పీలా వెంకటలక్ష్మి, కిరణ్, రేవతీరావు

సీతమ్మధార: ఎన్నికల సమరానికి ఉత్తర నియోజకవర్గం సిద్ధమైంది. భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన సిద్ధం పేరిట నిర్వహించిన ఎన్నికల శంఖారావం భారీ బహిరంగ సభకు ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం సత్యం జంక్షన్ నుంచి భారీ వాహనాలతో బయలుదేరి వెళ్లారు. ముందుగా బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి కె.కె.రాజు కాన్వాయ్‌లో సత్యం జంక్షన్‌కు వచ్చి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అక్కడికి నియోజకవర్గంలోని అన్ని వార్డుల నుంచి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకుని.. నేరుగా సభా స్థలి వద్దకు పయనమయ్యారు. 10 వేల మంది నాయకులు, కార్యకర్తలతో ఆ ప్రాంతం జై జగన్ అన్న అంటూ నినాదాలతో మార్మోగింది.

సీఎం జగన్‌తోనే సమగ్రాభివృద్ధి

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి, విద్య, ఆరోగ్యం, ఉపాధి, మహిళా సాధికారిత కోసం దేనికైనా 'సిద్ధం' అనే నినాదంతో 2024 ఎన్నికలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్తున్నారన్నారు. ప్రతిపక్షాల అన్యాయాలు, కుట్రలను తిప్పికొట్టేందుకు తామంతా సిద్ధమని చెప్పారు. సీఎం సభకు ఉత్తర నియోజకవర్గం నుంచి 100 ఆటోలు, 95 బస్సులు, కారుల్లో సుమారు 10 వేల మంది బయలుదేరామన్నారు. 2024లో మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమన్నారు. 2024లో విశాఖ జిల్లాలోని అన్ని సీట్లను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. ఉత్తరాంధ్రను, విశాఖను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. విశాఖను ప్రపంచంలో అగ్రస్థానంలో ఉండేలా సీఎం వైఎస్ జగన్ ప్రణాళిక రచించారని, పరిపాలన రాజధానిగా ప్రతిపాదించారని పేర్కొన్నారు. సీఎం బహిరంగ సభకు కోలాహలంగా ప్రజలు తరలిరావడం గొప్ప విజయంగా అభివర్ణించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, ఫ్లోర్ లీడర్, పార్టీ రాష్ట్ర పార్లమెంట్, సిటీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, జేసీఎస్ ఇన్‌చార్జులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి సభకు బయలుదేరిన కె.కె.రాజు, నాయకులు

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు నుంచి ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు మహిళలు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ నుంచి సంగివలస సభకు బయలుదేరారు. సుమారు 60 ఆటోలు, 5 బస్సుల్లో జైజగన్ అంటూ నినాదాలు చేస్తూ సభ జయప్రదం చేయడమే కాక, మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించడానికి సైన్యంలా ముందు నడుస్తామన్నారు. ఈ సందర్భంగా బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు చేసిన, ఎన్ని జెండాలు జతకట్టినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, సీఎం పీఠంపై మళ్లీ కూర్చునేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు.

- 43వ వార్డు నుంచి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు 50 ఆటోలు, 5 బస్సుల్లో సిద్ధం సభకు తరలి వెళ్లారు. ఉషశ్రీ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడొచ్చినా భారీ మెజార్టీతో వైఎస్ జగన్ మళ్లీ సీఎం అవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.
- 25వ వార్డు నుంచి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేట కూడలి నుంచి ఆటోలు, బస్సుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు సభకు ర్యాలీగా పయనమయ్యారు. కార్పొరేటర్ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ప్రజలంతా ఉన్నారన్నారు.
- 26వ వార్డు నుంచి పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ మహారాణి పార్లర్ నుంచి సభకు తరలివెళ్లారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు తల ఎత్తుకుని తిరిగేలా ఆత్మవిశ్వాసం కల్పించిన సీఎం వైఎస్ జగన్ మరల ముఖ్యమంత్రిగా గెలిపించడానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వార్డు నాయకులు బొడ్డేటి కిరణ్, కొణతాల రేవతీరావు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు


పార్టీ కార్యాలయం నుంచి కాన్వాయ్‌లో తరలి వెళ్తున్న కె.కె.రాజు


51వ వార్డులో సిద్ధం సభకు బయలుదేరిన కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


53వ వార్డులో పోస్టర్ చేత పట్టి సైన్యంతో బయలుదేరిన కార్పొరేటర్ బర్కత్ అలీ

- 51వ వార్డు నుంచి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో 500 మందికి పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 8 బస్సుల్లో తరలివెళ్లారు.
- 53వ వార్డు నుంచి కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో 10 బస్సుల్లో 500 మందికి పైగా పార్టీ కార్యకర్తలు, నాయకులు,అభిమానులు సభలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా సభకు..

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు నుంచి కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 600 మంది 10 బస్సుల్లో సీఎం బహిరంగ సభకు ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు.


బస్సులో కార్యకర్తలను పలకరిస్తున్న కె.కె.రాజు


44వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి జై జగన్ నినాదాలు చేస్తున్న ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు


సీతంపేట కూడలిలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్


50వ వార్డులో బస్సును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్


సత్యం జంక్షన్‌లో సిద్ధంగా ఉన్న వాహనాలు

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక


బొత్స ఝాన్సీలక్ష్మిని కలిసిన గుంటూరు నరసింహారావు దంపతులు

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం లోక్‌సభ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీలక్ష్మిని శనివారం సిరిపురంలోని ఆమె నివాసంలో పార్టీ నాయకుడు గుంటూరు వెంకట నరసింహారావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యా వేత్త, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అవార్డు అందుకున్న ఝాన్సీలక్ష్మిని విశాఖ ప్రజలు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా తాజుద్దీన్ బాబా జయంతి వేడుకలు


జయంతి వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్దిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో శనివారం హజ్రత్ తాజుద్దీన్ బాబా రహమతుల్లా అలైహి వసల్లం 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ముస్లింలు ,చిన్నారులు నమాజ్‌లు ఆచరించి మసీదు ప్రాంగణంలో ఖురాన్ పఠించి, పాతేహ నిర్వహించి కేక్ కట్‌చేశారు. అనంతరం ఆ ప్రాంతంలో దావత్ నిర్వహించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా, కార్యదర్శి అన్సర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం


జయప్రభాశర్మను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ద్వారా ప్రజలకు విశేష సేవలందించిన క్లబ్ పూర్వ అధ్యక్షురాలు వి.జయప్రభాశర్మను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. వనితా భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చేసిన సేవలను సభ్యులు కొనియాడారు. తనను సత్కరించిన సభ్యులకు ప్రభాశర్మ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం ప్రారంభం


ఎన్‌జీజీవోస్ కాలనీలో ప్రచారం చేస్తున్న విష్ణుకుమార్‌రాజు, జీవీఎల్ నరసింహారావు

మురళీనగర్/మద్దిపాలెం: బీజేపీ తరఫున మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా ఆయన కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఉత్తర నియోజకవర్గ అభ్యర్థిగా బీజేపీ అధిష్టానం తనకు టికెట్ ఇస్తుందనే నమ్మకంతో ముందుగానే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించినట్లు విష్ణుకుమార్‌రాజు చెప్పారు. ఎన్‌జీజీవోస్ కాలనీ, 50, 51 వార్డుల పరిధి మాధవధారలోని పలు ప్రాంతాల్లో ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయనకు మద్దతుగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న టెక్ ఫెస్ట్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా శనివారం నిర్వహించిన టెక్ ఫెస్ట్, మోడల్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. సివిల్, సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, బీఎస్ అండ్ హెచ్ అన్ని సాంకేతిక విభాగాలు అనేక నమూనాలు ప్రదర్శించాయి. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ ప్రిన్సిపాల్స్‌తో ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈఈఈ విభాగం విద్యార్థులు తయారు చేసిన ఇంగ్లిష్ క్లాస్‌రూమ్, ఎలక్ట్రిక్ కార్‌ను ఆయన ప్రారంభించి అభినందించారు. నగరంలోని పలు పాఠశాలలు, ఇంటర్ కళాశాలల విద్యార్థులు పాల్గొని నమూనాలను తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.


విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

ఈకార్వో వితరణ

రైల్వే హాస్పిటల్‌కు ఫొటోథెరపీ యూనిట్ అందజేత

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే హాస్పిటల్‌కు ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో), వాల్తేర్ సభ్యులు నవజాత శిశువులకు ఉపయోగపడే పరికరాన్ని వితరణ చేశారు. రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(సీఎంఎస్) డాక్టర్ తిరు అరుళ్ జోతి సమక్షంలో దీనిని అందజేశారు. ప్రస్తుత కాలంలో నూతనంగా జన్మించిన శిశువులకు సర్వసాధారణంగా వచ్చే నియోనటల్ జాండిస్ నుంచి మొదటి వారంలో సంరక్షణ ఇచ్చేందుకు ఈ ఫొటోథెరపీ యూనిట్ ఉపకరిస్తుందని ఈకార్వో సభ్యులు తెలిపారు. దీని వల్ల ఇటువంటి వారిని వేరే ఆస్పత్రులకు తరలించాల్సిన అవసరం లేకుండా రైల్వే హాస్పటల్‌లోనే చికిత్సం అందించవచ్చన్నారు. ఈ హాస్పిటల్‌లో నెలకు సగటున 15–20 ప్రసవాలు జరుగుతున్నాయని, ఈ పరికరం వల్ల మరింత మంది పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఈకార్వో కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్ మధుస్మిత సాహూ, కవితా గుప్తా, ఈకార్వో ఇతర సభ్యులు పాల్గొన్నారు.


ఫొటోథెరపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రతినిధులు, డాక్టర్ తిరు అరుళ్ జోతి

వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం శంకరమఠం రోడ్‌లోని ఒక హోటల్‌లో వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అర్బన్ యూనిట్ అధ్యక్షుడు పి.నారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు జర్నలిస్టులకు సహాయం అందిస్తామన్నారు. సోమవారం నుంచి కలెక్టరేట్ ప్రాంగణంలోని ఏపీ ఎన్జీవో భవనంలో సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి.శ్రీనివాసరావు, డి.రవికుమార్, బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ నాయకులు ఈరోతి ఈశ్వరరావు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు కార్డులు అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు, నారాయణ

సీనియర్ వాకర్ సత్యనాథానికి సన్మానం

మురళీనగర్: వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథంను వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. శనివారం నిర్వహించిన క్లబ్ ప్రత్యేక సమావేశంలో సత్యనాథం 90వ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పి.చంద్రమౌళి, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి ఐజాక్, జిల్లా 101 గవర్నర్ రంగారావు, ఇతర ప్రతినిధులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారికి సత్యనాథం కృతజ్ఞతలు తెలిపారు.


సత్యనాథాన్ని సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ పరిధి 11 కేవీ ఆర్‌కే నగర్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వసంత విహార్, ఆర్‌కే నగర్, ప్రెసిడెన్సియల్ స్కూల్, వెలమ భవనం, బీఎస్ లేఅవుట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బి.కె.నాయుడికి ప్రతిభా పురస్కారం

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు విద్యుత్ రంగంలో అంకితభావంతో పనిచేస్తున్నందుకు గాను ప్రతిభా పురస్కారం వరించింది. గణతంత్ర దిన వేడుకల్లో కలెక్టర్ ఎ.మల్లికార్జున చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం జోన్–2 కార్యాలయంలో బి.కె.నాయుడికి ఇతర అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మహిళల ఎదుగుదలకు కృషి

అల్లిపురం: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు అఖిల భారత మార్వాడీ సమాజ్ సంఘం కృషి చేస్తోందని సంఘ జాతీయ అధ్యక్షురాలు నీరు తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో శనివారం నగరంలోని మహారాష్ట్ర మండల్ నేషనల్ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గ్రామస్థాయి నుంచి ప్రజలకు సామాజిక సేవపై అవగాహన కలిస్తున్నట్లు చెప్పారు. దీంట్లో భాగంగా ప్రతి ఏటా రాష్ట్రస్థాయి సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విశాఖ కేంద్రంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మార్వాడీ మహిళలు ఆటపాటలతో సందడి చేశారు.

'పర్యావరణ హితంగా జీవించండి'


ఎకో వైజాగ్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు: 'పర్యావరణ హితంగా జీవించండి.. ప్రకృతి వనరులను కాపాడండి' అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా చిన్నవాల్తేరు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్లకార్డులను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తాము ఆరగించిన మామిడి, సపోటా, సీతాఫలం, నేరేడు వంటి ఫలాల విత్తనాలను ఆరబెట్టి, వర్షాలు కురిసే సమయంలో కొండలపై, ఇతర మైదానాల్లో, రహదారుల పక్కన చల్లాలన్నారు. తద్వారా అవి మొలకెత్తి, మొక్కలుగా వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం వనిత తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలపై అధ్యయన వివరాల వెల్లడి నేడు

నేడు ఏయూలో సమావేశం

మహారాణిపేట: ప్రఖ్యాత సినీ గేయ రచయిత, తెలుగు వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు నేతృత్వంలో కొంత మంది భక్త చైతన్యవంతుల బృందం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల చరిత్రలను అధ్యయనం చేస్తోంది. పలు దేవాలయాల నిర్మాణం వెనుక పెద్దల కృషి, దాతల దాతృత్వం, దేవాలయాలకు సంక్రమించిన ఆస్తులు, వాటి నిర్వహణ తీరులో జరుగుతున్న అపచారాలు, కావాలని దేవాలయాల ఆస్తులను కొల్లగొడుతున్న తీరుతెన్నులు, కైంకర్యమైపోతున్న దేవాలయాల ఆస్తిపాస్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఈ బృందం తమ అధ్యయన విశేషాలను రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో సభలు ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేస్తోంది. ఈ పరంపరలో భాగంగా ఆదివారం సాయంత్రం మద్దిలపాలెం జంక్షన్ సమీపంలో గల డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఒక సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ పూర్వ ముఖ్య కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, విశిష్ట అతిథులుగా విజయ్ నిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయకుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రఖ్యాత పద్యకవి వామరాజు సత్యమూర్తి, అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృతాంధ్ర పండితులు పీటీజీవి రంగాచార్యులు, సాహితీవేత్త నేమాని మంజునాథ శర్మ, సీనియర్ జర్నలిస్టు జీవీఎస్ మూర్తి పాల్గొంటారు. సూరంపూడి వీరభద్రరావు సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ కార్యక్రమానికి పతంజలి యోగా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వేదభాస్కరం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఘట్టి శ్రీ విద్య బృందంచే భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అర్చకులు అంతా తరలి రావాలని ఉత్తరాంధ్ర అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తలంక మురళీకృష్ణ తెలిపారు.

ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపు

మద్దిపాలెం: శ్రీ సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య అందిస్తున్న సేవలను గుర్తించి, సింహాచలం దేవస్థానం వారు పురస్కారాలు అందజేశారు. 50వ వార్డు మాధవధారకు చెందిన సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య వ్యవస్థాపకుడు సనపల నారాయణ స్వామి అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలకు గానూ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రశంసా పత్రం, జ్ఞాపికను ఈవో శ్రీనివాసమూర్తి చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. సమైక్య సభ్యులు పాల్గొన్నారు.


ఈవో శ్రీనివాసమూర్తి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న సనపల నారాయణస్వామి

స్టీల్‌ప్లాంట్ విక్రయం తగదు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిటు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను శత శాతం అమ్మేయాలని తప్పుడు నిర్ణయం తీసుకుందన్నారు. దానికి వ్యతిరేకంగా పోరాట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాయని చెప్పారు.